పరిచయం డాక్టర్ బిందు మెనన్

# ఊరికి వరం



గత ఐదేళ్లుగా 'న్యూరాలజీ ఆన్ వీల్స్'తో 29 గ్రామాలలో ఉచిత క్యాంపులు నిర్వహించిన డాక్టర్ బిందు నిన్న (ఆదివారం) 30వ గ్రామంగా నెల్లూరు జిల్లా వాకాడు మండలం గొల్లపాలెంలో పర్యటించారు.

నెల్లూరు, రామ్మూర్తిపేటలో భార్గవి నంబియార్ బిల్డింగ్. అందులోనే ఉంది యాక్సన్ న్యూరో అండ్ రీహాబ్ కేర్. డాక్టర్ గదిలో మదర్ థెరిసా ఫొటో చూపరులను ఆకర్షిస్తోంది. "నిస్వార్థమైన సేవకు ప్రతిరూపం మదర్. ఎంత చేసినా ఆమెను చేరుకోవడం అసాధ్యం. కానీ ఆమెను చూస్తూ ఉంటే ఆమె చేసిన సేవలో ఒక్క వంతు అయినా చేయగలనేమోనని ఆశ. రోజూ మదర్ ఫొటో చూస్తూ ప్రేరణ పొందుతుంటాను" అని చిరునవ్వుతో అన్నారు డాక్టర్ బిందు మెనన్.

డాక్టర్ బిందు మెనన్ తండ్రి రామచంద్ర నంబియార్‌ది కేరళ. ఆయన భోపాల్‌లోని బిహెచ్ఈఎల్‌లో ఉద్యోగం చేసి అక్కడే స్థిరపడ్డారు. బిందు మెనన్ పుట్టింది, పెరిగింది భోపాల్‌లోనే. ఎంబీబీఎస్ తర్వాత గ్వాలియర్, ముంబయి, బెంగళూరుల్లో న్యూరాలజీలో స్పెషల్ కోర్సులు చేసి తిరుపతి స్విమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. చేరిన తొలినాళ్లలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకున్నారు డాక్టర్ మెనన్.

"అది 2002. తిరుపతిలోని స్విమ్స్‌లో (శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఓపీ చూస్తున్నాను. పేషెంట్‌లు తమ కష్టాన్ని తెలుగులో చెప్తున్నారు. ఇంగ్లిష్ వచ్చిన ఒక నర్స్ అనువదిస్తోంది. పేషెంట్ పది వాక్యాల్లో చెప్పిన విషయాన్ని ట్రాన్స్‌లేటర్ రెండు వాక్యాల్లో ముగిస్తోంది. ట్రాన్స్‌లేటర్ చెప్తున్న విషయాలతోపాటు పేషెంట్ మాటల్లో వినిపిస్తున్న బాధను మనసుతో విని వైద్యం చేస్తున్నాను. సంతృప్తిగా అనిపించడం లేదు. పేషెంట్ – డాక్టర్ మధ్య మరో మనిషి ఉండకూడదు, ట్రాన్స్‌లేటర్ అయినా సరే.. ఉండకూడదు. వ్యాధి చిన్నది కావచ్చు పెద్దది కావచ్చు, కానీ ఆ వ్యాధి కారణంగా రోగి మానసికంగా పడే ఆందోళన ఎవరికి వాళ్లకు అదే పెద్దది. ఆ బాధను డాక్టర్లు పేషెంట్ భాషలోనే వినగలగాలి. అప్పుడే పేషెంట్‌కి డాక్టర్ మీద నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకమే అసలైన వైద్యం. డాక్టర్ తన వృత్తికి న్యాయం చేయగలిగేది పేషెంట్ భాషలో మాట్లాడగలిగినప్పుడే. అందుకే తెలుగు నేర్చుకున్నాను. ఉద్యోగంలో చేరిన ఆరు నెలల్లో అనువాదకుల అవసరం లేకుండా వైద్యం చేయగలిగాను. ఆరేళ్ల తర్వాత నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజ్‌కి వెళ్లాను. ప్రస్తుతం అపోలో హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను" అని తెలిపారు డాక్టర్ మెనన్.

## పేదల దగ్గరకు దారి

అపోలో హాస్పిటల్ ఆమెను సంపన్నుల డాక్టర్‌ను చేసింది. అప్పటి వరకు ఆమె దగ్గర వైద్యం చేయించుకున్న పేదవాళ్లు ఆమె గురించి అడగడం, ఆమె లేరని తెలిసి అసంతృప్తికి లోనవుతున్న సమాచారం ఆమెకు చేరుతూనే ఉంది. ఆమె దగ్గరే వైద్యం చేయించుకోవాలని ఉన్న పేదవాళ్లను.. ఆమె ఉన్న పెద్ద హాస్పిటల్ గేటు కూడా భయపెడుతుంటుంది. అప్పుడు వచ్చిన ఆలోచనే న్యూరాలజీ ఆన్ వీల్స్. తనతో వైద్యం చేయించుకోవాలనుకుంటున్న పేద వాళ్ల దగ్గరకు తానే వెళ్లడానికి ఆమె స్వయంగా నిర్మించుకున్న మార్గమే 'న్యూరాలజీ ఆన్ వీల్స్'.

## తిరిగి పట్టాలెక్కుతున్న జీవితాలు

"డాక్టర్ చెప్పే మాటలు వినాలని, డాక్టర్‌తో తన కష్టం చెప్పుకోవాలని కోరుకుంటారు పేషెంట్లు. అందుకే గ్రామాలకు వెళ్లి వైద్యం చేస్తున్నాను. గ్రామానికి వెళ్లినప్పుడు ముందుగా నరాల సమస్యలు ఎన్ని రకాలుంటాయో వివరిస్తాను. ఆ తర్వాత ఉచితంగా పరీక్షలు చేస్తాను. మందులు కొనుక్కోలేని వాళ్లను బిందు మెనన్ ఫౌండేషన్ ద్వారా దత్తత చేసుకుంటాను. వాళ్లు పూర్తిగా కోలుకునే వరకు నెలనెలా మందులు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఇస్తున్నాం. అందుకే నేను చేస్తున్న పనికి 'వియ్ రీచ్, వియ్ టీచ్, వియ్ ట్రీట్' అనే థీమ్‌ను రూపొందించుకున్నాను. మా వైద్యసేవ ద్వారా వార్ధక్యంలో ఉన్న వాళ్లు స్వస్థత పొంది ఒకరి మీద ఆధారపడకుండా తమ పనులు తాము చేసుకోగలిగిన స్థితికి చేరుతున్నారు. ఇంట్లో సంపాదించే వ్యక్తి పక్షవాతానికి గురైతే ఆ కుటుంబం తలకిందులైపోతుంది. అలాంటి పేషెంట్‌లు పూర్తిగా కోలుకుని తిరిగి కుటుంబ బాధ్యతలు చేపట్టినప్పుడు ఆ ఇంట్లో అందరి జీవితాలూ తిరిగి గాడిన పడ్డాయని సంతోషంగా ఉంటుంది. డాక్టర్‌గా నేను గెలిచానని పించే సందర్భాలవి" అన్నారు బిందు మెనన్.

### అవార్డులు

- 11 అంతర్జాతీయ, 24 జాతీయ అవార్డులు
- 'వరల్డ్ స్ట్రోక్ అవార్డు'
- ఎపిలెప్సీ లీడర్‌షిప్ అవార్డు
- సాక్షి ఎక్సలెన్స్ అవార్డు (హెల్త్‌కేర్ విభాగం)

## చైతన్యమే నివారణోపాయం

వైద్యం ఎంత విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ పేదరికం కూడా అదే స్థాయిలో వికటాట్టహాసం చేస్తోంది. పేదరికానికి అవగాహన లేమి కూడా తోడైతే ఇక హెల్దీ సొసైటీ అనే మాట కలలకే పరిమితమవుతుంది. "ఆహారపు అలవాట్ల మార్పు కారణంగా ముప్పై- నలభై ఏళ్లకే హై బీపీ, షుగర్ వచ్చేస్తున్నాయి. ధూమపానం, మద్యపానం అనే మరో రెండు వ్యసనాలు అలవాటై పోయి ఉంటున్నాయి, దేహానికి వ్యాయామం ఉండదు. ఇన్ని సవాళ్ల తో జీవితాన్ని నెట్టుకొస్తున్న దేహం ఏ రోజైనా కుప్పకూలిపోవచ్చు. అందుకే హైబీపీ దశలోనే వాళ్ల జీవనశైలిని మార్చగలిగితే పక్షవాతాన్ని నివారించవచ్చు. వ్యాధుల పట్ల జనంలో చైతన్యం కలిగిస్తే, ఆ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చు. నేను చేస్తున్న ప్రయత్నం అదే" అన్నారు డాక్టర్ బిందు మెనన్.



వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలతో ప్రత్యేకంగా తయారైన 'న్యూరాలజీ ఆన్ వీల్స్' వాహనంలో గొల్లపాలెం గ్రామస్థురాలికి చికిత్స చేస్తున్న డాక్టర్ బిందు మెనన్

– వాకా మంజులా రెడ్డి

ఫొటోలు: ఆవుల కమలాకర్, సాక్షి, నెల్లూరు

## పల్లెలకు వైద్యరథం

డాక్టర్ బిందు మెనన్.. 'ఎపిలెప్సీ హెల్ప్' యాప్ డెవలప్ చేయించారు. పేషెంట్‌లు మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేషెంట్ వివరాలు యాప్‌లో నమోదైన తర్వాత రెగ్యులర్ చెకప్ చేసుకోవాల్సిన తేదీతో పాటు ఇతర ఆరోగ్య సేవలకు ఫోన్‌లో అలర్ట్ వస్తుంది. ఎమర్జెన్సీ నంబర్ కూడా ఉంటుంది. మలయాళం, హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో పేషెంట్ నమోదు చేసుకున్న వివరాలు గోప్యంగా ఉంటాయి. ఇది కాకుండా మైగ్రేన్, స్ట్రోక్, ఎపిలెప్సీ టెలీ అవేర్‌నెస్ టోల్ ఫ్రీ నంబర్ 1800 10 20 237 కూడా అందుబాటులో ఉంది. దీంతో పాటు ఆమె వెన్నునొప్పి, మెడనొప్పి, చేతులు తిమ్మిర్లు పట్టడం వంటి అనేక నరాల సంబంధిత సమస్యల పట్ల ప్రాథమిక సమాచారంతో కూడిన వీడియోలను రికార్డు చేశారు. ఒక్కొక్కటి ఐదు నిమిషాల నిడివితో ఉన్న ఈ హెల్త్ అవేర్‌నెస్ వీడియోలను వేలాది మంది వీక్షిస్తున్నారు. పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్థుల కోసం ఒక సపోర్టు గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఇవన్నీ చదువుకున్న వాళ్లు, టెక్నాలజీని అందిపుచ్చుకున్న వాళ్లలో ఆరోగ్య చైతన్యం కల్పించడం కోసం ఆమె చేస్తున్న పనులు. ఇవన్నీ ఒక మోస్తరు అవగాహన ఉన్న వాళ్లను చేరే సాధనాలు. అయితే న్యూరాలజీ సమస్య గురించి ఏ మాత్రం తెలియని వాళ్లకు నరాల వ్యాధుల పట్ల చైతన్యం కలిగించడం కోసం ఆమె స్వయంగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. టెక్నాలజీని పల్లె పల్లెకూ తీసుకెళ్లాలని కంకణం కట్టుకున్నారు. న్యూరాలజీ ఆన్ వీల్స్ ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో 30 గ్రామాల్లో పర్యటించింది. "న్యూరాలజీ చదివిన డాక్టర్లు అందరూ నగరాలకే పరిమితమై పోతే, గ్రామాల్లో వైద్యం అందేదెలాగ" అన్నారామె. పక్షవాతం పేషెంట్‌లను నగరాలకు తీసుకెళ్లి వైద్యం చేయించుకోగలిగిన స్థోమత అందరికీ ఉండదు. హెల్త్ అవేర్‌నెస్ లేకపోవడంతోపాటు ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా పక్షవాతానికి గురైన ఎన్నో జీవితాలు మంచానికే పరిమితమైపోతున్నాయి. వాళ్లను తిరిగి నడిపించడానికి ఆమె తీసుకున్న నిర్ణయమే 'న్యూరాలజీ ఆన్ వీల్స్'. ఈ సేవలందిస్తున్న బిందు మెనన్ ఫౌండేషన్ 'సౌత్ ఈస్ట్ ఏషియా, స్ట్రోక్ ఆర్గనైజేషన్‌కు మెంబర్‌గా నియామకమైంది.



వృద్ధుడికి ధైర్యం చెబుతున్న డాక్టర్ మెనన్

SAKSHI
MEDIA GROUP
సాక్షి తెలుగు దినపత్రిక
సాక్షి SAKSHI TV
www.sakshi.com